
# నాటకాలాడుకుందాం...



– కె.కె. రఘునందన.

విజయనగరంలో హస్తబల్ హాలు, చైనులు గారు ఈతరం వాళ్లకి కొత్త కావచ్చేమో గాని, పాత రస్తాలకి కొట్టిన పిండే.

ప్రాచీన నాటకాల నుంచి ఈమధ్యనే కుర్రవాళ్లు ఆడుతున్న పరిషత్ నాటకాల దాకా చైనులు గారికి కరతలామలకమే...

విభిన్నతను సంతరించుకున్న శైలి ఆయనది. క్షుణ్ణతను ఒంటబట్టించుకున్న చైనులు గారిని అధ్యయనం చేయటం కొందరికి చేతకాకపోవచ్చు గాని అర్థం చేసుకున్న వారికి మాత్రం ఆణిముత్యమే!

నాటకం బ్రతకాలి... కలకాలం... నిత్య నూతనంగా... అదే ఆశయం... ధ్యేయం... దృఢ సంకల్పం...

"చైనులు గారూ... ఈ చివరి కాలంలో మీకెందుకండీ ఈ శ్రమ? హాయిగా 'కృష్ణా...రామా...' అనుకోని కూచోరాదా..." అని ఎవరైనా అంటే అంతెత్తున లేచేవారు.

కళామతల్లికి కొనఊపిరి దాకా సేవ చేసినా ఇంకా సశేషమే ఆయన దృష్టిలో...

దేశ రక్షణకై నిలబడ్డ వీర జవానులా ఆత్మశుద్ధితో నాటకం చేపట్టేవారు. అన్ని కోణాల్లోంచి చూసేవారు. దేనిలో రాజీ లేదు. తన నిర్ణయం తనదే. జిగిబిగి సడలనివ్వని తర్ఫీదు... రిహార్సల్స్‌లో వెకిలితనానికి చోటు లేదు.

నటరాజు ఎదుట అభాను పాలవటం ఇచ్చగించనితనం చైనులు గారి మీద చాదస్తపు ముద్ర వేసింది. అయినప్పటికీ ఆటుపోట్లు తట్టుకోవడం వెన్నతో పెట్టిన విద్య. అదే ఆయన నాటకాలను బ్రతికించింది.

చైనులు గారి నాటకమంటే జనానికో ప్రత్యేక ప్రీతి– ఆకర్షణానూ... ఆయన 'స్కూల్' వేరు... రీతి, రివాజులు ప్రత్యేక తరహాలో విలసిల్లేవి. నాటకమంటే ఓ ఉద్యమం... దానికి దారితీసింది ఒకరైనా ఆ త్రోవలోనే అందరి అడుగులు నడకగా సాగాలని ఆకాంక్ష. ఆ ఉద్యమంలో చైనులు గారెన్నింటినో త్యాగం చేశారు. రోగిష్టి భార్య ఏనాడో లోకం వీడింది. పిల్లల చదువులు చెట్టెక్కాయి. ఆరోగ్యం అంతంత మాత్రం అయింది. వార్ధక్యపు నీడ వికటాట్టహాసం చేసింది.

ఇన్ని అనర్థాలు జరిగినా... సుడిగుండాలు చెలరేగినా... అంత ఉధృతిని నొక్కి పెట్టేసి నాటకానికి ఊపిరి పోయాలన్న తపన... జిగేష మిగిలాయి.

తనకున్న కొద్దిపాటి శక్తితోనే తన చివరి కోరిక నెలాగైనా సాఫల్యం చేసుకోవాలన్న ఉద్విగ్నత బలమైన మర్రి ఊడయింది.

నవయుగ నాట్యమండలి వారిని తన దగ్గరకే రప్పించుకున్నారు. "మన ఈ విజయనగరంలో కళలు ఏ రీతిగా వికసించిందీ మీరెరగనిది కాదు. నాకు బలం వున్నంత కాలం నాటక కళకు ఎలా అంకితమైనానో నే చెప్పుకుంటే బాగోదు... కానీ నా చివరి కోరిక తీరే లోగానే నాలో శక్తి శూన్యమైంది. మీరెవరైనా నా కోరికను..." ఆయన మాటల్లో తొట్రుపాటు మౌనానికి చోటైంది... అదీ కొద్దిసేపే...

"నా కోరికల్లా 'మహా ప్రళయం' నాటకం ఆడాలని. దాన్ని ఈ ఆంధ్ర దేశమంతా ఆడాలని చాలాకాలం నుండి నాకుండేది. కాని, కనీసం మన విజయనగరంలో ప్రేక్షకులకయినా అందించలేకపోయాను. అదే నా బాధ. నా సలహా సంప్రదింపులు మీకు ఎల్లవేళలా ఉంటాయి. నా సమకాలికులు సంగయ్య గారు దర్శకత్వ బాధ్యతలు చేపడతారు" అందరివైపు చూశారు.

చైనులు గారికి వాళ్ల మొహాలు మసగ్గా కనిపిస్తున్నాయి. "మీరన్న దాంట్లో పొల్లు లేదు. కాని 'మహా ప్రళయం' ఆడటం నిజంగా ప్రళయమే! ఎంత ఖర్చో... అందుకే కదా, లోగడ మీరు వెనకడుగు వేసింది... ముగ్గురు హీరోయిన్స్... ఒకప్పుడు కళ కోసం వెంపర్లాడేవారు. ప్రతి రిహార్సల్స్‌కి ఎంతో కొంత చేతిలో పెడితేగాని రాని పరిస్థితి..." నాటకమండలి అధ్యక్షుడు భాస్కరమురళి వివరించాడు.

మిగతావారు వెలిబుచ్చిన అభిప్రాయాలు తలో రీతిగా ఉన్నాయి.

అయినా చైనులు గారి అభిలాష తలొంచలేదు.

"నాటకం పేరు చెబితే ఎంతో కొంత రాల్చటానికి మన విజయనగరం గొడ్డు పోలేదు. జనం నాటకాలు ఆదరిస్తూనే వున్నారు. మనలో తృష్ణ కలకాలం నిలిచి వుండాలి తప్ప... మరోసారి ప్రోత్సహించడానికి శంకించలేదు."

సరేనన్నారంతా...

కోరికలు తీర్చే కామధేనువులా కనిపించింది నాటక బృందం చైనులు గారి కంటికి.

అప్పుడప్పుడు కళాకారుల కాలనీ నుండి... మేకప్‌మేన్ కృష్ణను తోడు తీసుకుని మహారాజా కళాశాలలో జరుగుతున్న రిహార్సల్స్ దగ్గరకు వెళితే గానీ మనస్సుండబట్టేది కాదు.

మధ్య మధ్య చైనులు గారు కల్పించుకునేవారు.

"అయినా మీకెందుకీ చాదస్తం చైనులూ... మీ కోరిక తీరాలి అంతేగా..." అని మురళి అంటుంటే గొప్ప బాధపడేవారు.

వంటకంలో ఘుమఘుమకు తోడైన కరివేపాకుకు పట్టిన గతే తనదీనూ..

ఒక్కోసారి కృష్ణ వచ్చి రిహార్సల్స్ దగ్గర తచ్చాడి వచ్చి విశేషాలు చెబుతుండేవాడు.

హీరోయిన్స్‌తో యికయికలూ... పకపకలూ... ఎవరికి తోచిన విధంగా వారు చేయటమే కాని సంగయ్య గారి సూచనలకు అంత ప్రాధాన్యత నివ్వటం లేదట! ఎంతసేపూ చందాలు... విరాళాలు... యిదే గోలట...

చైనులు గారి హృది నిప్పుల కుంపటే అయింది.

విజయనగరంలో నాటకం మీద మంచి పట్టున్నవారు పి.వి.రమణయ్య మేస్టారు, చానో, జాన్ మేస్టారూ... నాటకాన్ని వాళ్లు ఆషామాషీ వ్యవహారంలా చూసేవారు కాదు. తను సైతం వారి పంథానే అనుసరించేవాడు.

చైనులు గారి మెత్తటి మాటలు దెబ్బతిన్నాయి.

'మహా ప్రళయం' రిహార్సల్స్ కంప్లీట్ అయినట్లుగా మురళి ద్వారా తెలిసింది.

నాటకం తేదీ ఖరారయింది. హస్తబల్ హాల్‌లో ప్రదర్శన... పాత్రో గారి ద్వారా ప్రచారానికి కొదువలేదు. మూడు లాంతర్లు, గంట స్తంభం, బాలాజీ జంక్షన్, మయూరీ దగ్గర పెద్ద అక్షరాలతో అందమైన బోర్డులు పెట్టారు.

కానీ, చైనులు గారిలో ఎడతెగని విచార భావం విహంగాన్ని బాణం తాకినట్లుగా విలవిలలాడించింది.

"అందరికీ ఆహ్వానాలు పంపారు. మీకు పంపటానికి వారికి చేతులు రాలేదా... అందువల్ల మీరా నాటకానికి పోవద్దు" వెనక్కి లాగాడు కృష్ణ.

"అసలు నాటకం అంటేనే గజిబిజి... పని ఒత్తిడిలో పొరపాటుగా పంపి ఉండరు... నా కోరికను వారు ఆదరించటమే నాకు ఆహ్వానం..."

అని పెద్ద మనసుతో నాటకం రోజున సాయంత్రం కృష్ణతో బయలుదేరారు.

ఆ కళా ప్రాంగణంలోకి మొట్టమొదటి ప్రేక్షకుడిగా చైనులు గారే ప్రవేశించారు. ఓ మూలగా ఆయన్ను కూర్చోబెట్టి ఊతకర్ర చేతికిచ్చి తాను సిగరెట్ వెలిగించుకుందుకు కదిలాడు కృష్ణ

చైనులు గారిని చూసి పలకరించినవారు కొందరైతే, మరికొందరి గొంతులు పోల్చి ఆయనే పలకరించారు. కొందరైతే ఆయన్ని పెద్ద పట్టించుకోలేదు కూడా.

తను పకడ్బందీగా నాటకాలాడే రోజుల్లో ప్రతివారి నోట తన పేరే తారక మంత్రంలా వచ్చేది.

ఒక్కసారి కనులు చెమ్మగిల్లాయి.

కుర్చీలు లాక్కుని కూర్చున్న చప్పుళ్లు... హలోలు, హాయ్‌లు... పలకరింపుల మేళాలా ఉంది.

కనుమూసిన చీకటి... ఇంకా మొదలవదేం...?!

మనసులో మాట బయటకు వచ్చింది.

"కొండవలస రాజుగారు రావాలట..." ఆ గొంతుక చైనులుగారి కెరుకే.

"అరె సంగమేశ్వరరావు..."

"మీరా చైనులు గారూ... మనం కళింగపట్నం పరిషత్‌లో జడ్జీలుగా వ్యవహరించాం... గుర్తుందా!'' తెగ పొంగిపోయాడు సంగమేశ్వరరావు.

''ఎందుకు లేదూ... 'కోతి వుండు బ్రహ్మరాక్షసి'కి అయిదారు ప్రైజులిచ్చాం కూడా..." గొంతు కలిపారు చైనులుగారు.

పాతకాలం ముచ్చట్లు ఎంత చెప్పుకున్నా వారిరువురికీ తనివి తీరలేదు. తరగనూ లేదు.

''రస హృదయులైన ప్రేక్షకులకు... మా'నవయుగ మండలి' హృదయ పూర్వక కళాభివందనాలు... టి.వి. మీడియా దగ్గర నుంచి జనాన్ని మరలించాలనే మంచి దృష్టితో నాటకాలను పునరుద్ధరించాలని ఈ 'మహా ప్రళయా'న్ని ఆడుతున్నాం... ఈ నాటకాన్ని ఆడాలన్న తపనతో ప్రోత్సహించిన ప్రముఖులు కొండవలస రాజుగారు... ఆయన్ని వేదిక మీదకి ఆహ్వానిస్తున్నాం..."

చప్పట్లు... కావవి... చైనులుగారి నెత్తిన పిడుగులు... నాటకాన్ని ఆడాలని ఘోష పెట్టింది తనూ... కాని వాళ్లు చెబుతున్నది...

"కొండవలస రాజు గారికి పుష్పగుచ్ఛం అందించవలసిందిగా జవహర్ బాబును కోరుతున్నాం...'' అనగానే జవహర్‌బాబు భారీకాయంతో వెళ్లి అందించాడు.

"తర్వాత... కళే తన జీవితం...తన ఊపిరి అన్న భావంతో... అహరహమూ శ్రమిస్తున్న భట్టి భాగవతయ్యను స్టేజి మీదకు ఆహ్వానిస్తున్నాం..." అనగానే చైనులుగారి నోటంట... 'ప్చ్' అన్న ధ్వని మెత్తగా మూల్గింది.

పరిషత్‌ల పేరుతో జనాలను దోచుకునే వీడు కళకి అంకితమైన మనిషా?!

"ఈరోజు ముఖ్య అతిథిగా నవనీతరావును పిలుస్తున్నాం..."

ఆయనకో పూలగుత్తి అందింది.

"ఇప్పుడు అసలు సిసలు కథ... మన విజయనగరంలో నాటకం అంటేనే ఆనందరావు పేరు ప్రతినోటా నాన్తుంది. ఆయన మంచి నటులు... రచయిత... ప్రయోక్త... వక్త... ఇత్యాది సకల అర్హతలు వున్న ఈయనను మా మండలి సన్మానింప తలపెట్టింది."

చప్పట్లు హోరెత్తాయి... ఈలలు...

ఆనందరావు వేదిక చేరాడు.

అతను ఈమధ్యనే రిటైరైనాడు. టౌన్లో ఏ నవూజం నాటకం ఆడినా ఓ పాత్రలో దూరిపోతుంటాడు. హీరోయిన్స్‌తో రాసుకు పూసుకు తిరగటం ప్రత్యేకత... అటువంటి వాడికి సన్మానం...

హతవిధీ...

"ప్రస్తుతం 'గోడ' నాటిక అన్ని పరిషత్‌లకూ కట్టాం... ఈ రోజే 'సాతులూరు' వారికి స్క్రూటినీ ఇచ్చాం... ఇప్పుడే స్క్రూటినైజర్‌ను దిగబెట్టి వస్తున్నాను...'' ప్రక్కనున్న ఎవరితోనో మాట్లాడుతుంటే చైనులుగారు పోల్చారు...

"కిశోర్ కదూ..."

"చైనులుగారా! నమస్తే..." ఆప్యాయంగా చేతులు పట్టుకుని వదిలాడు కిశోర్.

"ఈ రోజు కొండవలస రాజుగారి దయాభిక్ష మీదనే మన విజయనగరంలో నాటకాలు

ఆడుతున్నాయంటే అతిశయోక్తి కాదేమో... ఎవరికైనా కోట్ల ఆస్తులుండవచ్చుగాక... ఈ రాజ్యాన్నేలే రాజులే కావచ్చుగాక... అయినా కానీ కొండవలస రాజుగారికి దీటే లేదు. ఇప్పుడు రాజుగారు ప్రసంగిస్తారు..." అధ్యక్షులవారి మైకు రాజుగారికి అందింది.

వణికే చేతుల్తో మైకు పట్టుకుని, "నాటకాల పరిస్థితి చూస్తే నా గుండె కరిగిపోతుంది. దానిపై బ్రతికే కళాకారులను చూస్తే మనస్సు కదిలిపోతుంది. అందుకే నేను కరిగిపోయేదాకా, పాడె మీదకి కదిలి పోయేదాకా ఈ కళాసేవ చేస్తూనే వుంటానని మీ అందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను..." అని కూర్చుండిపోయారు.

మొమెంటో... ఫ్లస్ పూలదండ... చప్పట్ల హోరు...

క్లిక్... క్లిక్...

సమయం ఏడు గంటల నలభై నిముషాలు...

"కుమారిని మొదట బుక్ చేశారు కామోసు..."

"ఔను... ఆ అమ్మాయి బొబ్బిలి వారితో బరంపురం పరిషత్‌కి వెళ్తోందిట... ఇంక చంద్రనో, దివ్యనో పెట్టుకోవాలి. మొగాళ్లతో పబ్లిగ్గా తిరగటానికి భయపడని ఆడవాళ్లు... నాటకాల్లో వేయటానికి మాత్రం ముందుకి రారు... ఆ జాడ్యం ఇంకా పోలేదు... వెతుక్కోలేక ఛస్తున్నాం..." ఏదో సమాజం వారి సంభాషణ.

"ఇప్పుడు ఆనందరావు సన్మానం..."

బూరె బుగ్గల ఆనందరావు... సప్లయర్స్ నుండి తెచ్చిన సింహాసనంలో కూలబడ్డాడు.

టేపు రికార్డర్‌లోంచి ఇన్‌స్టెంట్ మంగళవాద్యాలు... కొండవలస రాజుగారు, భట్టి భాగవతయ్య కలగలిపి దండధారణ చేశారు.

'క్లిక్... క్లిక్...'మనే సమయానికి నవనీతరావు వెనక నిలబడ్డాడు.

భట్టి ప్రసంగం...

"గోవు మాలచ్చిమి అన్నారు పెద్దలు... అవును కామధేనువు... అన్నారు పూర్వులు... సన్మానం అందుకుంటున్న మహానుభావుడి పేరులో మొదటి అక్షరం ఆయనలో సాధుత్వానికి ప్రతీక... రెండో అక్షరం నటరాజుకి సేవ చేసిన దానికి సంకేతం... ద- అంటే దయ... రా- అంటే రామణీయకత... వు- అనగా ఉదారత... వీటన్నింటినీ కలబోస్తే మన ఆనందరావు... మనీషి ఆనందరావు..."

చప్పట్లు... ఈలలు... కేకలు...

సమయం... ఎనిమిది పదిహేను...

ఇప్పుడు ఆనందరావు గారిని తమ అభిమానులు ఉచిత రీతిన సత్కరిస్తారు.

"నవనీతా ఆర్ట్స్... గరివిడి.:."

వేదికెక్కారు... దండ వేశారు...

చప్పట్లు... క్లిక్... క్లిక్‌లు...

"సృజన నాటక సమాజం... పార్వతీపురం..."

దండ... చప్పట్లు..: క్లిక్... క్లిక్...

"సహృదయ కళాసేవా పీఠం... బాడంగి..."

షరా మామూలే...

"గురజాడ ఆర్ట్స్... విజయనగరం..."

ఇంకా ఎన్నెన్నో... ఎందరెందరో...

దోబూచి ఆట కోసం మొహం కప్పేసుకున్నట్లుగా వున్నాడు ఆనందరావు... నమస్కారంతో ఉంచిన చేతులే కొంగ మెడలా బయటకు కనిపిస్తున్నాయి.

"టైమ్ ప్లీజ్..." -ఒకరు...

"ఎయిట్ థర్టీ..."

కుర్చీలు ప్రక్కకు లాగేసి ఉడాయిస్తున్న వారి సంఖ్య లెక్క పెట్టుకోవటమే మన పని. ఏదో అర్జంటు పని ఉందని కొండవలస రాజుగారు వేదిక దిగి 'మారుతి' ఎక్కారు.

ఒక అర్ధగంటదాకా ఆనందరావు పీకాడు.

"నాటకం చూద్దామని వస్తే ఏంటీ 'సుత్తి'- మూడు గంటలైంది ప్రారంభించి ఇంకా మొదలెట్టనే లేదు..." ఓ ముసలాయన పరమ అసహనం ప్రదర్శించాడు.

కొందరు బ్యాడ్జీలు ధరించిన వారితో చెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది.

చైనులు గారికి ఉండబట్టక కృష్ణతో అన్నారు...

అయిదు నిముషాల్లో తిరిగి వచ్చిన కృష్ణ- "అయ్యా! ఎవరికి వారే నాయకులు... ఇక్కడ నాటకం చూడటానికి వచ్చినవారి గురించి పట్టించుకునే వాడెవడని!" అన్నాడు.

"మరి కాస్సేపట్లో నాటకం మొదలవుతుంది" అని చెప్పి 'శుక్లాంబరధరం' కానిచ్చారు. 'కొబ్బరికాయ పగిలిన చప్పుడు...' మైకులో బిగ్గరగా.

'మహా ప్రళయం' నాటకం... మైకులో రెండుసార్లు ప్రకటన... అరె రచయిత పేరేదీ... దర్శకత్వం మాత్రం పట్టిపట్టి చెప్పారే...

తెర తెరిచారు... అంత లైటింగ్‌లోనూ దృశ్యం స్పష్టత లేదు చైనులు గారికి.

మొదటి రంగం... నటుల ఎంపికలో లోపం స్పష్టంగా కనిపిస్తోంది. డైలాగుల్లో మృదుత్వం లేదు... మ్యూజిక్ మాత్రం డామినేట్ చేస్తోంది.

మొదటి రంగం సమాప్తం...

అర్ధభాగం ప్రేక్షకులు... దడదడమంటూ కుర్చీల్లోంచి లేచిన దాఖలాలు...

"అయ్యా గమనిక! మా నాటకానికి తమ ఇతోధిక సాయం అందించిన వారెందరో... ఇంకెవరైనా వుంటే వారు ఈ వేదిక మీదకు వచ్చి చదివించవలసిందిగా కోరుతున్నాము..."

ఒకరొక్కరే స్టేజి ఎక్కటం... విరాళం యివ్వటం... పేరు చదవటం... చదివించినవారు చల్లగా చేతులు దులుపుకున్నట్లు వెళ్లిపోసాగారు.

చైనులు గారిలో నరాలు తెగిపోయినంతగా టెన్షన్... ఆ నటరాజుకే ద్రోహం జరిగినట్లుగా బాధపడ్డారు.

రెండవ రంగం మొదలయ్యేసరికి పది గంటల పది నిముషాలు... లైట్స్ ఆనండాఫ్ అయ్యేసరికి బయట బండ్లు స్టార్ట్ చేసిన చప్పుళ్లు...

మరో అరగంటకు చివరి రంగం...

మూలంలో లేని సినిమా పాటలు... అర్థం లేని అనవసర హాస్యం జొప్పించారు. దీంతో పారిపోయే ప్రేక్షకుల సంఖ్య అధికమైంది.

నాటకం అయిందనిపించారు.

పాత్రధారులు పరిచయం... ఇంకెవరు చూస్తారని... చూడాలని... రచయిత పేరు... పరిచయం...? హుం! మైకు, లైటింగ్ వగైరాలు కూడా తెలిపి... ఛీ! ఏం మనుషులు...

లేనిపోని భేషజాలకు పోయి ఎందుకు నాటకాలాడ్డం... జనానికి వినోదానికా... జేబు నింపుకోటానికా... అయితే నాటకాలాడకండి...

నటరాజుకి పాదాభివందనం చేస్తూనే కళను నిలువునా ఊచకోత కోయటాని కయితే నాటకాలాడకండి...

బిరుదులు... సన్మానాలు... మెహర్బానీలు... మొమెంటోలు... వీటి కోసమే అయితే నాటకాలే ఆడాల్సిన పనిలేదు.

మీట నొక్కితే కంటికెదురుగా బొమ్మ కదిలితే వినోదించే ప్రేక్షకుడిని చేయిపట్టి ఈడ్చుకుని రంగస్థలం దగ్గరకు తీసుకువచ్చినా... అతడికి తగిన మర్యాదనిచ్చి, గౌరవించి ఆసాంతం కూర్చోబెట్టగలిగితేనే గొప్పతనం.

కాని జరుగుతున్నది...! వేదిక మీద పెద్దల కోసం నానా హంగామా ప్రదర్శిస్తున్న వాళ్లు... వేదిక క్రిందనున్న ప్రేక్షకుడికి కనీస విలువనివ్వటం లేదు. పైగా లాభాల లావాదేవీల సంతలా మార్చారు వేదికను.

తను బ్రతికి, కొందరిని బ్రతికించే పదుగురి గుండెలలో పదికాలాల పాటు నిలిచే నాటకాన్ని ఖూనీ చేశారు.

నాటకాలున్నాయి... ఆడేవారికి కొరత లేదు... వినోదించే వారికీ లోటు లేదు. కాని ఎక్కడ... ఎక్కడ? ఎక్కడుంది లోపం? ఎందుకు నాటకాలంటే విరక్తి, ఏవగింపు కలుగుతున్నాయి. ఇటువంటి కుహనా నాటక సమాజాల వల్లా... చిత్తశుద్ధి లేని మనుషుల వల్ల... వారికి కావలసింది కీర్తి కాంక్ష! నలుగురి నోట్లో నానాలనే యావ... అంతే తప్ప వచ్చి కూర్చునే ప్రేక్షకుడి గురించి వారికి అక్కర్లేదు... అతడిని పట్టించుకోనప్పుడు, అతడు ఏ మీడియా వైపు పరిగెడితే ఏం?

రకరకాల భావాలు కలగలిపిన ఉప్పెన చైనులుగారి గుండె గదులను కల్లోలపరుస్తోంది.

కాని తరువాత ఆ గుండె గదుల్లో పూర్తి శూన్యత ఆవరించింది. అందుకే ఏ అలికిడి లేదు.

"చైనులు గారూ! వెళదాం పదండి..." కృష్ణ కదిపాడు.

ఆయన బొమ్మలా వాలిపోయారో వైపుకి...

"అయ్యా... సంగయ్య గారూ! చైనులు గారింక లేరు" ఆర్తనాదంలా కృష్ణ.

నిరామయంగా వున్న వేదిక నిర్జీవంగా నవ్వుతోంది.

"మహా ప్రళయం రచయిత చైనులుగారి మృతికి నవయుగ కళామండలి తీవ్ర సంతాపం..."

–మర్నాటి పేపర్లో వార్త చదివి విరాగిలా నవ్వాడు కృష్ణ.

○